క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకం



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం తిరుప్పావై సేవను జరిపారు. ఈఓ గోపీ, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, అర్చకుడు మురళీధరాచార్యులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలపై ముమ్మర తనిఖీలు



నెల్లూరు(అర్బన్): గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలను జిల్లాలో అరికట్టేందుకు గానూ స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్స్‌ను ముమ్మరంగా చేపడుతున్నామని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. పీసీ, పీఎన్డీటీ చట్టం అమలుపై నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఆకస్మికంగా తనిఖీలు చేసేందుకు గానూ ఎనిమిది మంది అధికారులను ప్రత్యేకంగా నియమించామని చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్, కమిటీ సభ్యులు డాక్టర్ పద్మజ, కరిముల్లా, డివిజనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్, డెమో అధికారి కనకరత్నం, ఎన్జీఓలు కవితారెడ్డి, ఇరగబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిలు, హోటళ్ల యాజమానులకు నోటీసులు



మేనేజర్లతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని పలు లాడ్జిలు, హోటళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు మకాం వేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో నేరనియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు నగర డీఎస్పీ సింధుప్రియ నేతృత్వంలో నగర పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని లాడ్జీలు, హోటళ్లలో క్షుణ్ణంగా తనిఖీలను నిర్వహిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవంటూ నోటీసులను జారీ చేస్తున్నారు. చిన్నబజారు స్టేషన్ పరిధిలోని లాడ్జిలు, హోటళ్ల మేనేజర్లతో సమావేశాన్ని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు నిర్వహించి నోటీసులను అందజేశారు. లాడ్జిల్లో బసచేసే వ్యక్తుల వివరాలను పోలీస్‌స్టేషన్లో రోజూ సమర్పించాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే తెలియజేయాలని సూచించారు.

అనారోగ్యంతో ఏఎస్సై మృతి



లక్ష్మీనరసయ్య (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నవాబుపేట ఏఎస్సై లక్ష్మీనరసయ్య మంగళవారం మృతి చెందారు. 1992లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన ఆయన పోలీస్ అధికారుల సంఘ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రెండుసార్లు బాధ్యతలు నిర్వర్తించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. నిప్పో సెంటర్ సమీపంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల స్వగృహానికి ఆయన పార్థివదేహం బుధవారం తెల్లవారుజామున చేరుకోనుంది. కాగా లక్ష్మీనరసయ్య మృతికి పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీహరి తదితరులు సంతాపం తెలియజేశారు.

నడిరోడ్డుపైనే చెత్త



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కొందరు తమ ఇష్టానుసారంగా చెత్తను నడిరోడ్డుపైనే వేస్తున్నారు. వెంకటేశ్వరపురంలోని లక్ష్మీవీధి సమీపంలో ఈ పరిస్థితి నెలకొనడంతో ఈ ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. సీసీ కెమెరాలను కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినా, చెత్తను పలువురు యథేచ్ఛగా వేస్తున్నారు.

ఛాయ్.. తాగరా భాయ్

- నగరంలో వీధివీధినా టీ షాపులు
- రకరకాల ఫ్లేవర్లు లభ్యం
- యువతను ఆకట్టుకుంటున్న నిర్వాహకులు



నగరంలోని ఓ టీ దుకాణం వద్ద సందడి

నెల్లూరు (పొగతోట): దైనందిన జీవితంలో టీ ఓ భాగమైపోయింది. ఛాయ్ తాగుతూ స్నేహితులు ముచ్చటిస్తూ సరదాగా గడుపుతుంటారు. దీనికి విపరీతమైన క్రేజ్ ఏర్పడుతుండటంతో నగరంలోని వీధివీధినా టీ షాపులు వెలుస్తున్నాయి. రకరకాల ఫ్లేవర్లను అందిస్తూ యువతను నిర్వాహకులు ఇట్టే ఆకర్షిస్తున్నారు. ఫలితంగా దుకాణాల్లో విపరీతమైన రద్దీ నెలకొంటోంది.

800కు పైగా..

నగరంలో ఘుమఘుమల ఛాయ్ దుకాణాల సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతోంది. వీధికి ఒకట్రెండు షాపులున్నాయంటే వీటిపై ఉన్న క్రేజ్ ఏమిటో అర్థం చేసుకోవచ్చు. నెల్లూరులో 800కుపైగా ఛాయ్ దుకాణాలున్నాయని అంచనా. ఇరానీ ఛాయ్, అల్లం, పుదీనా, లెమన్, జింజర్ టీపై ప్రజలు మక్కువ చూపుతున్నారు. ఉదయాన్నే వాకింగ్ అనంతరం లెమన్, గ్రీన్ టీ తదితరాలను సేవిస్తున్నారు. ఉదయం 5.30 నుంచి రాత్రి పది వరకు ఇవి కిటకిటలాడుతున్నాయి. స్నేహితులు కలిసిన సమయాల్లో ఛాయ్ సేవిస్తూ పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారులు సైతం వీటిని సేవిస్తూ తమ వ్యాపార లావాదేవీలను కొనసాగిస్తున్నారు. పెద్ద హోటళ్లకు వెళ్లి కాఫీ, టీ తాగాలంటే భారీగా సమర్పించుకోవాల్సి వస్తోంది. అదే సాధారణ షాపుల్లో రూ.10 నుంచి రూ.15కే టీ వస్తోంది. దీంతో ప్రజలు మక్కువ చూపుతున్నారు.

ఆకర్షిస్తూ..

టీ కప్పుల మొదలుకొని ఫ్లేవర్స్ వరకు నూతన రకాలను ప్రజలకు పరిచయం చేస్తున్నారు. చిల్డ్రన్స్ పార్కు, మినీబైపాస్ ప్రాంతాల్లో మట్టితో తయారు చేసిన గ్లాసుల్లో టీని సరఫరా చేస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు.

అందుబాటులో నూతన ఫ్లేవర్లు

ఇంట్లో టీ, కాఫీయే అందుబాటులో ఉంటాయి. అదే దుకాణాల్లో రకరకాల ఫ్లేవర్లతో లభిస్తున్నాయి. దీంతో వీటివైపు ఆకర్షితులవుతున్నాం. రోజూ మూడుసార్లు టీ తాగుతా.

– హేమంత్, వేదాయపాళెం

తక్కువ ఖర్చు.. రుచి అధికం

నగరంలో టీ దుకాణాల సంఖ్య పెరిగిపోతోంది. స్టార్ హోటల్‌కు వెళ్లి టీ, కాఫీ తాగాలంటే రూ.100 వరకు ఖర్చవుతోంది. అదే రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన దుకాణాల్లో తక్కువ ధరకే ఇవి లభ్యమవుతున్నాయి.

– బాలాజీరావు, అయ్యప్పగుడి

అభ్యంతరాలను ముందే తెలియజేయాలి



మాట్లాడుతున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ప్రారంభ దశలోనే యజమానులకు తెలియజేయాలని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగాధికారులతో తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. డీటీసీపీ నిర్దేశించిన మార్గదర్శకాలపై భవన నిర్మాణ యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టేలా అధికారులు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కోరారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేసే దుకాణాలు మార్జిన్ నిబంధనల మేరకు ఉండేలా చూడాలని, అవసరమైన వారు వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. భవన నిర్మాణాల అనుమతులకు దరఖాస్తు చేసే సమయంలోనే ఉల్లంఘనల్లేకుండా సరి చూసుకోవాలని, నిబంధనలు అతిక్రమించకుండా నిర్మాణాలు జరిగేలా టౌన్‌ప్లానింగ్ విభాగం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. డీసీపీ పద్మజ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వేణు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటు ప్రకటనపై హర్షం



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(బృందావనం): అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంపై ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం హర్షం వ్యక్తం చేశారు. స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థాన సమీపంలో గల ఆవోపా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు వీరబ్రహ్మం, ఈసీ మెంబర్లు దరిశి హరికృష్ణ, భవనాసి సురేష్, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి జనార్దన్, రాజా హజరత్, కోట మధుసూదన్‌రావు, ఆంజనేయులు, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చట్టపరమైన చర్యలకు వినతి

నెల్లూరు(క్రైమ్): మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న రాధా మనోహర్ దాస్‌పై చర్యలు చేపట్టాలని నెల్లూరు క్రీస్తు దళం సభ్యులు కోరారు. ఈ మేరకు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పాస్టర్ బెన్హర్‌బాబు, యేసురత్నం, రాజశేఖర్, శశి, సంతోష్, జాషువా, జాన్సన్, సతీష్‌సాగర్, రమణయ్య, ప్రభుకుమార్, కమల్ ఫిలిప్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశేషారెడ్డికి నివాళులు



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల కన్వీనర్ పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తండ్రి పుచ్చలపల్లి ఆదిశేషారెడ్డి మృతి చెందారు. ఈ క్రమంలో పెనుబర్తిలో ఆయన మృతదేహానికి విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మంగళవారం నివాళులర్పించారు. పార్టీ నేతలు ఏసునాయుడు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో పేదలకు దుప్పట్లను కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, రామ్మోహన్‌రావు, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తుల సమగ్రాభివృద్ధికి చర్యలు

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని కులవృత్తుల సమగ్రాభివృద్ధికి చర్యలు చేపడతామని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. ఆదరణ – 3 పథకంపై రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ కులవృత్తుల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేకరించిన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి తెలియజేస్తామని చెప్పారు.

కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవాలి

నెల్లూరు(అర్బన్): కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకునేందుకు గానూ తగు జాగ్రత్తలు పాటించాలని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి యూరాలజిస్ట్ గోకుల్ నచికేత్, సీనియర్ నెఫ్రాలజిస్ట్ మాధవ్‌దేశాయ్ పేర్కొన్నారు. ప్రపంచ కిడ్నీ మాసోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ ఆస్పత్రిలో స్క్రీనింగ్ పరీక్షలను అతి తక్కువ ఖర్చుకే అందిస్తున్నామని చెప్పారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ రేపు

నెల్లూరు (టౌన్): పార్థసారథినగర్‌లోని జెనెక్స్ విజన్ స్కూల్లో పూల్ క్యాంపస్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించనున్నామని విద్యాసంస్థల చైర్మన్ వెంగళరెడ్డి, డైరెక్టర్ కొండలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు రాత పరీక్షను నిర్వహించనున్నారని, 2024లో బీఎస్సీ కంప్యూటర్స్ లేదా బీసీఏ పూర్తి చేసిన అన్ని కళాశాలల విద్యార్థులు హాజరుకావొచ్చని చెప్పారు. పాల్గొనాలనుకునే వారు ఉదయం 8.30కు రిపోర్టు చేయాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్మానంతో న్యాయం



ఎమ్మార్పీఎస్ నేతల ర్యాలీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎస్సీ వర్గీకరణ తీర్మానంతో మాదిగలకు న్యాయం జరిగిందని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ, వర్గీకరణ జేఏసీ నేత గడ్డం శేఖర్ హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణకు అనుకూలంగా తీర్మానాన్ని రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. వీఆర్సీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి క్షీరాభిషేకాన్ని మంగళవారం నిర్వహించారు. వేగూరు విజయకుమార్ కుడుముల సుబ్బారావు చెంచురామయ్య ఆనందరావు క్రాంతి చిన్నయ్య కన్యకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ చెల్లదు



మాలల సింహగర్జన పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాజకీయపరమైన ఎస్సీ వర్గీకరణ చెల్లదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమల సుదర్శనం పేర్కొన్నారు. మాలల సింహ గర్జనకు సంబంధించి నగరంలోని ఓ హోటల్లో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర మంత్రి మండలి తీర్మానం చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణను రద్దు చేయించే అంశమై హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు.

23న మాలల సింహగర్జన

మాలల సింహగర్జనను తిరుపతిలో ఆదివారం నిర్వహించనున్నామని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణా వెంకయ్య తెలిపారు. దాసరి చెన్నకేశవులు వెంకయ్య, ఈదూరు విజయకుమార్, హరి, ఏసునాయుడు, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్



నెల్లూరు(అర్బన్): సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్ – 3 ఏఎన్‌ఎంలకు ఎంపీహెచ్‌డబ్ల్యూ – ఎఫ్‌గా ఉద్యోగోన్నతులను కల్పించేందుకు గానూ కౌన్సెలింగ్‌ను మంగళవారం నిర్వహించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాత అందజేశారు. మొత్తం 289 మంది ఉద్యోగోన్నతులను పొందారని ఆమె చెప్పారు.

అట్రాసిటీ చట్టం పక్కాగా అమలు



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: అట్రాసిటీ చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా స్థాయి విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మురళీకృష్ణయాదవ్, ప్రవల్లిక, శ్రీరాములు, ప్రభాకర్, సాయిప్రసాద్ మాట్లాడారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాలు శిథిలావస్థలో ఉన్నాయని, వీటి పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. వసతిగృహాల్లోని పిల్లలతో పనులు చేయిస్తున్నారని, నగరంలోని అంబేడ్కర్ భవన్ నిర్మాణం పురోగతిలో లేదని తెలిపారు. వివిధ సమస్యలను తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. వసతిగృహాల్లోని పిల్లలతో వివిధ రకాల పనులు చేయిస్తున్న వార్డెన్లు, ఇతర ఉద్యోగులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఎస్టీలకు ఆధార్ కార్డులను ఇప్పించేందుకు మండలాల వారీగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించామని వివరించారు. తోటపల్లిగూడూరు మండలంలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా 450 మందికి కార్డులను అందజేశామని చెప్పారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో 146 మంది ఎస్సీ, ఎస్టీ బాధితులకు రూ.2.63 కోట్ల నష్ట పరిహారాన్ని అందించామని, మరో 24 మందికి రూ.28.25 లక్షలను అందజేసే ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఆర్డీఓలు వంశీకృష్ణ, అనూష తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ముసుగుల సేవ





చక్రస్నానం, పుణ్యకోటి విమాన మహోత్సవం

నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో తిరుమంజనం తదితర పూజలను విశేషంగా మంగళవారం నిర్వహించారు. ముసుగుల సేవ, చక్రస్నానాన్ని వేడుకగా జరిపారు. పుణ్యకోటి విమాన మహోత్సవాన్ని నేత్రపర్వంగా రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా కొండా మల్లికార్జునరెడ్డి, వెంకట్రామ్, వైష్ణవి వ్యవహరించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుష్పయాగం, దవనోత్సవం, ధ్వజావరోహణాన్ని బుధవారం నిర్వహించనున్నారు.

పన్నులను వసూలు చేయండి



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): మొండి బకాయిదారుల నుంచి పన్నులను వసూలు చేయాలని, లేని పక్షంలో ఆస్తులను జప్తు చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ విభాగాధికారులు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరులోపు బకాయిలను వసూలు చేసేలా అడ్మిన్ కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. బకాయిల వసూళ్లపై చేపట్టిన చర్యలను నివేదిక రూపంలో తదుపరి సమావేశంలో అందించాలని చెప్పారు. రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, రెవెన్యూ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయండి

అర్హులను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని నెల్లూరు సిటీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సూర్యతేజ ఆదేశించారు. ఎన్నికల అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 6, 7, 8 క్లెయిమ్ ఫారాలను నిర్ణీత గడువులోపు పరిష్కరించి, బూత్‌స్థాయి అధికారులను క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో అదనంగా పోలింగ్ కేంద్రాలు అవసరమైన ప్రాంతాలపై నివేదికలను అందజేయాలని చెప్పారు. విచారణ జరిపి నూతన పోలింగ్ కేంద్రాలకు అనుమతులను మంజూరు చేయనున్నామని వెల్లడించారు. ఏఈఆర్వో షఫీమాలిక్, ఎలక్షన్ డీటీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులను అందుబాటులోకి తేవాలి

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కుల్లో మౌలిక వసతులను కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. ఆరో డివిజన్లోని పప్పుల వీధి, శెట్టిగుంట రోడ్డు, జీనిగలవీధి తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పప్పులవీధిలోని ప్రజా పార్కును సందర్శించిన ఆయన.. అక్కడ పచ్చదనం, ఆట వస్తువులు తదితరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. స్థానిక చేపల మార్కెట్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగించకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్పొరేటర్ మస్తానమ్మ, ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, హార్టికల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, డీఈఈ రఘురామ్, ముజాహిద్దీన్, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


టౌన్‌హాల్లో నిర్వహించిన స్క్వే మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఏసీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులను కమిషనర్ సూర్యతేజ తన చాంబర్‌లో అభినందించారు. ఏజీఎం శ్రీకాంత్, ప్రిన్సిపల్ ప్రవీణ్, స్క్వే మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల అందజేత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏపీ సూపర్‌లీగ్‌లో పాల్గొనే కోరమాండల్ ఫుట్‌బాల్ జట్టుకు క్రీడా దుస్తులను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 ఫుట్‌బాల్ క్లబ్‌ల జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయని, గెలుపొందిన వారు లీగ్ – 1, సీజన్ – 3కి అర్హత సాధించనున్నారని వివరించారు. కోరమాండల్ జట్టు శిక్షణ శిబిరాన్ని నగరంలో నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. మలిరెడ్డి ప్రీతమ్‌రెడ్డి, కెప్టెన్ సూర్యతేజ, కోచ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత



మాట్లాడుతున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందని సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ పేర్కొన్నారు. వేదాయపాళెంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. పెరిగిన విద్యుత్ చార్జీలు, ఇంటి పన్నులు, నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే పగలగొట్టాలని గత ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం, తాజాగా వీటిపై మొగ్గు చూపడం సిగ్గుచేటని విమర్శించారు. నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, కొండాయపాళెం రైల్వే గేట్ వద్ద బాక్స్‌టైపు బ్రిడ్జి.. మెడికవర్ ఆస్పత్రి సెంటర్ వద్ద ఫ్లయ్‌ఓవర్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నేతలు మాదాల వెంకటేశ్వర్లు, షాహినాబేగం, నాగేశ్వరరావు, మాలకొండయ్య, పెంచలనరసయ్య, రఫీ అహ్మద్, సంపత్‌కుమార్, శ్రీనివాసులు ,కృష్ణమూర్తి తదితరులు ,పాల్గొన్నారు.